# 4 రోజులు 13,54,817 దరఖాస్తులు

ప్రజాపాలనకు పోటెత్తుతున్న దరఖాస్తులు

- నాలుగు రోజుల వ్యవధిలో 13,54,817లక్షల అప్లికేషన్లు
- మంగళవారం ఒక్కరోజే 3,62,606 అప్లికేషన్ల స్వీకరణ


రసూల్‌పురాలో దరఖాస్తులు స్వీకరిస్తున్న అధికారులు

**స్వీకరించిన మొత్తం దరఖాస్తులు**

| జోన్ | మంగళవారం స్వీకరించినవి | నాలుగు రోజుల్లో స్వీకరించిన మొత్తం |
|---|---|---|
| ఎల్బీనగర్ | 43974 | 178187 |
| చార్మినార్ | 103975 | 352670 |
| ఖైరతాబాద్ | 62328 | 226350 |
| కూకట్‌పల్లి | 54847 | 226815 |
| శేరిలింగంపల్లి | 34105 | 126519 |
| సికింద్రాబాద్ | 56092 | 219538 |
| కంటోన్మెంట్ ఏరియా | 7285 | 24738 |
| | 3,62,606 | 13,54,817 |

సిటీబ్యూరో, జనవరి 2 (నమస్తే తెలంగాణ) : గ్రేటర్ హైదరాబాద్‌లో ప్రజా పాలన దరఖాస్తుల స్వీకరణ ముమ్మరంగా కొనసాగుతున్నది. అభయహస్తంలో భాగంగా ప్రభుత్వం ప్రజాపాలన వేదికగా ప్రజల నుంచి దరఖాస్తులను 150 డివిజన్లలో ప్రత్యేక ఏర్పాట్ల నడుమ స్వీకరిస్తున్నది. నాలుగు రోజులకు సంబంధించి అభయహస్తంతో పాటు కొత్త రేషన్‌కార్డు, ఇతర సమస్యలపై ప్రజలు సమర్పించిన దరఖాస్తులు మొత్తం 13,54,817లను అధికారులు స్వీకరించారు. ఇందులో అభయహస్తం కింద 11,31,390 దరఖాస్తులు ఉండగా, ఇతర ఆప్లికేషన్లు 2,23,427 ఉన్నాయి. మంగళవారం ఒక్కరోజే 3,62,606 దరఖాస్తులను స్వీకరించినట్లు కమిషనర్ రొనాల్డ్ రాస్ తెలిపారు. ప్రజాపాలన కార్యక్రమం ప్రశాంతంగా జరుగుతుందని కమిషనర్ పేర్కొన్నారు. కాగా దరఖాస్తుల స్వీకరణలో అత్యధికంగా రేషన్‌కార్డు, ఇందిరమ్మ ఇల్లు, గృహలక్ష్మి, రూ.500లకు సిలిండర్‌లకు సంబంధించిన దరఖాస్తులు వస్తున్నట్లు అధికారులు పేర్కొన్నారు.


పంచాయతీ రాజ్ శాఖ మంత్రి సీతక్కను సన్మానిస్తున్న మామిడి హరికృష్ణ, బెల్లం మాధవి

## సావిత్రిబాయిని స్ఫూర్తిగా తీసుకోవాలి

- పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క

రవీంద్రభారతి, జనవరి 2 : చదువుల తల్లి సావిత్రిబాయి పూలేను మహిళలు స్ఫూర్తిగా తీసుకొని ముందుకు సాగాలని రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క అన్నారు. సావిత్రిబాయి పూలే ఉమెన్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్, తెలంగాణ చాంపర్స్ ఆఫ్ కామర్స్ ఇండస్ట్రీ సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం రవీంద్రభారతిలోని మెయిన్‌హాల్‌లో సావిత్రిబాయి పూలే 193వ జయంతి కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మంత్రి సీతక్క, భాషా సాంస్కృతిక శాఖ సంచాలకులు మామిడి హరికృష్ణ, వ్యవస్థాపక ఫౌండర్ బెల్లం మాధవి హాజరై సావిత్రిబాయి చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో లత, మేకల కీర్తి, గిడిగు క్రాంతికృష్ణ, సూర్యనాగభవాని, దుర్గ, స్వప్నారావు, సురభి, తదితరులు పాల్గొన్నారు.


ఉస్మానియా దవాఖానలో ఓపీ క్లినిక్‌లను ప్రారంభిస్తున్న రాష్ట్ర ఇన్‌చార్జి డీఎంఈ డాక్టర్ త్రివేణి, అకాడమిక్ డీఎంఈ శివరామ్‌ప్రసాద్, దవాఖాన సూపరింటెండెంట్ డాక్టర్ బి.నాగేందర్

## ఉస్మానియాలో ఓపీ క్లినిక్‌లు ప్రారంభం

సుల్తాన్‌బజార్, జనవరి 2 : అనారోగ్యంతో దవాఖానకు వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలందిస్తున్న ఉస్మానియా దవాఖాన వైద్యులను రాష్ట్ర ఇన్‌చార్జి డీఎంఈ డాక్టర్ త్రివేణి, అకాడమిక్ డీఎంఈ డాక్టర్ శివరామ్‌ప్రసాద్ అభినందించారు. మంగళవారం ఉస్మానియా దవాఖానలో నూతనంగా ఆధునీకరించిన నెఫ్రాలజీ, మెడికల్ గ్యాస్ట్రో ఎంట్రాలజీ విభాగాల ఔట్ పేషెంట్ క్లినిక్‌లను దవాఖాన సూపరింటెండెంట్ డాక్టర్ బి.నాగేందర్, గ్యాస్ట్రో ఎంట్రాలజీ విభాగాధిపతి డాక్టర్ రమేశ్, నెఫ్రాలజీ విభాగాధిపతి డాక్టర్ మనీషా సహాయ్‌లతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దవాఖానలో రెండు ఓపీ క్లినిక్‌లను ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో దవాఖాన సీఎస్ ఆర్‌ఎంవో-1 డాక్టర్ శేషాద్రి, డిప్యూటీ సీఎస్ ఆర్‌ఎంవోలు డాక్టర్ సాయిశోభ, డాక్టర్ బండారి శ్రీనివాసులు, ఎండోక్రైనాలజీ విభాగాధిపతి డాక్టర్ రాకేశ్ సహాయ్, అనస్థీషియా విభాగాధిపతి డాక్టర్ పాండునాయక్, ఆర్‌ఎంవోలు డాక్టర్ అనురాధ, డాక్టర్ మాధవి, డాక్టర్ ఎండీ రఫీ, డాక్టర్ విజయభాస్కర్, నర్సింగ్ సూపరింటెండెంట్ సుజాత, స్టాఫ్ నర్సు శిరీష, తదితరులు పాల్గొన్నారు.



## ఆర్టీఏ కార్యాలయంలో నూతన సంవత్సర వేడుకలు..

జూబ్లీహిల్స్, జనవరి 2 : హైదరాబాద్ జాయింట్ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ సి.రమేశ్, జేటీసీ (అడ్మిన్) జె.పాండురంగ్ నాయక్‌లను ఖైరతాబాద్‌లోని ఆర్టీఏ కార్యాలయంలో ఎస్టీఏ అండ్ ఆర్టీఓలు, ఎంవీఐలు, ఏఎంవీఐలు, మినిస్టీరియల్ స్టాఫ్, ట్రాన్స్‌పోర్ట్ కానిస్టేబుల్స్, హోమ్ గార్డులు కలిసి పుష్ప గుచ్ఛం అందించి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

## సంక్రాంతికి 32 ప్రత్యేక రైళ్లు

- ఈ నెల 7 నుంచి అందుబాటులోకి

సిటీబ్యూరో, జనవరి 2 (నమస్తే తెలంగాణ) : సంక్రాంతి పండుగ సందర్భంగా 32 ప్రత్యేక రైళ్లను ఏర్పాటు చేస్తూ దక్షిణ మధ్య రైల్వే జోన్ అధికారులు నిర్ణయం తీసుకున్నారు. ఈ నెల 7 నుంచి 27 వరకు రాకపోకలు సాగిస్తాయన్నారు. సికింద్రాబాద్-బ్రహ్మపూర్, బ్రహ్మపూర్-వికారాబాద్, విశాఖపట్నం-కర్నూల్ సిటీ, శ్రీకాకుళం-వికారాబాద్, సికింద్రాబాద్-తిరుపతి, సికింద్రాబాద్-కాకినాడ టౌన్, నర్సాపూర్-సికింద్రాబాద్ వంటి రైల్వే స్టేషన్ల మధ్య ప్రత్యేక రైళ్ల రాకపోకలు కొనసాగుతాయన్నారు. అదేవిధంగా హిసర్-తిరుపతి రైల్వే స్టేషన్ల మధ్యలో రెండు ప్రత్యేక రైళ్లను పొడిగించారు. ఫిబ్రవరి 3 నుంచి ఏప్రిల్ 2 వరకు రాకపోకలు సాగిస్తాయని తెలిపారు.

### భద్రత అంశంపై రైల్వే జీఎం సమీక్ష..

దక్షిణ మధ్య రైల్వే జోన్ ఆధ్వర్యంలో రైళ్ల కార్యకలాపాల భద్రతపై వివరణాత్మక సమీక్ష సమావేశాన్ని జోనల్ మేనేజర్ అరుణ్‌కుమార్ జైన్ నిర్వహించారు. ఈ సమావేశంలో సికింద్రాబాద్, హైదరాబాద్, విజయవాడ, గుంతకల్, గుంటూరు, నాందేడ్ డివిజనల్ రైల్వే మేనేజర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు.

## డ్రైనేజీలో కెమికల్.. పేలిపోయిన మ్యాన్‌హోల్స్


ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

చర్లపల్లి, జనవరి 2 : చర్లపల్లి డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాలలో భూగర్భ డ్రైనేజీ మ్యాన్‌హోల్స్‌లో పేలు సంభవించి మ్యాన్‌హోల్స్ మూతలు ఎగిరిపడ్డాయి. ఆఫీసర్స్ కాలనీ, వెంకటరెడ్డి నగర్, మధుసూదన్ రెడ్డినగర్‌లలో ఒక్కసారిగా ఘాటైన వాసనలు వెలువడటంతో కాలనీల వాసులు భయాందోళనకు గురై ఇండ్లనుంచి రోడ్లపైకి పరుగులు తీశారు. ఏ జరుగుతుందో తెలియక ప్రజలు ఉక్కిరిబిక్కిరయ్యారు. మధుసూదన్ రెడ్డి నగర్‌లో రోడ్డు వెంబడి నివాసముండే గుడిసె వాసులు వంట చేసుకుంటుండగా విషవాయువులు వ్యాపించి మంటలు అంటుకోవడంతో బిహార్‌కు చెందిన ఇద్దరు వ్యక్తులకు తీవ్ర గాయాలయ్యాయి. వారిని చికిత్స నిమిత్తం దవాఖానకు తరలించారు. సమాచారం అందుకున్న ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి సంఘటనా స్థలానికి చేరుకొని అన్ని విభాగాల అధికారులు, పోలీసులతో పరిస్థితిని సమీక్షించారు. కెమికల్స్ వదిలిన వారిపై చర్యలు తీసుకోవాలని, పరిశ్రమలను సీజ్ చేయాలని ఆదేశించారు. సహాయక చర్యలలో చర్లపల్లి ఇన్‌స్పెక్టర్ మల్లికార్జున్ రెడ్డి, ఎస్‌ఐ శేఖర్, జీహెచ్‌ఎంసీ ఏఈ ఏఈ స్వరూపలతో పాటు డీఆర్‌ఎఫ్, పీసీబీ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఉప్పల్ సీఎంఆర్‌లో అగ్నిప్రమాదం



ఉప్పల్, జనవరి 2 :ఉప్పల్‌లోని సీఎంఆర్ షాపింగ్ మాల్‌లో భారీ అగ్నిప్రమాదం జరిగింది. మంగళవారం రాత్రి షాపింగ్ మాల్ మూసివేసిన తర్వాత మంటలు వ్యాపించడంతో భారీ ప్రాణ నష్టం తప్పింది. షాపింగ్ మాల్ ముందు భాగంలోని ఎలివేషన్ పూర్తిగా దగ్ధమైంది. సమాచారం అందుకున్న ఫైర్ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని మంటలను అదుపులోకి తెచ్చారు. అయితే షాపింగ్ మాల్‌లో ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది.


అగ్నిమాపక సిబ్బందితో డీజీ వై.నాగిరెడ్డి మంగళవారం సమావేశమయ్యారు. వారికి పలు సలహాలు, సూచనలు తెలియజేశారు.



డీజీపీ రవిగుప్తాను కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుతున్న పోలీసు అధికారుల సంఘం ప్రతినిధులు